
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
మంగళవారం 12 మార్చి 2024




రంజాన్ వేళలు
మంగళవారం ఇఫ్తార్ 6.31
బుధవారం సహర్ 5.04



మల్లగుల్లాలు

ఇందిర గెలిచిన చోట కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై తర్జనభర్జన

- సవాల్‌గా మారిన మెదక్ పార్లమెంట్ స్థానం
- గతంలో లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో హస్తందే హవా
- 2004 నుంచి బీఆర్ఎస్‌కు కంచుకోట
- అసెంబ్లీ ఎన్నికలలో గులాబీదే ఆధిపత్యం



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 11 : నలభై ఏళ్ల కిందట దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పుడు అభ్యర్థి ఎంపిక కోసం కాంగ్రెస్ పార్టీ మల్లగుల్లాలు పడుతున్నది. గతంలో కొన్ని దశాబ్దాల పాటు ఈ ప్రాంతం కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచింది. 1979-84 మధ్యకాలంలో దివంగత ఇందిరాగాంధీ మెదక్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి, ప్రధానిగా కొనసాగారు. ఆ తర్వాత కాలంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దివంగత మాజీ మంత్రి ఎం.బాగారెడ్డి రెండు దశాబ్దాలు మెదక్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. తర్వాతి కాలంలో తెలంగాణ ఉద్యమం మొదలవడంతో కాంగ్రెస్‌కు ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి.

బీఆర్ఎస్‌కు వరుస విజయాలు

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పాటైన అప్పటి టీఆర్ఎస్ పార్టీ 2004 ఎన్నికలలో కాంగ్రెస్‌తో పొత్తుతో కుదుర్చుకున్నది. ఆ ఎన్నికలలో ఇక్కడి నుంచి టీఆర్ఎస్(బీఆర్ఎస్) అభ్యర్థి, దివంగత ఆలె నరేంద్ర గెలుపొందారు. ఆ తర్వాత పొత్తు లేకపోయినా 2009, 2014, 2019 ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ విజయం సాధిస్తూ వచ్చింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పడిన అనంతరం పదేళ్ల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయిందన్న విమర్శలకు ఆ పార్టీ ధీటైన జవాబిచ్చింది. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టింది. ఆ పార్టీకి వచ్చే నెలలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలు సవాల్‌గా నిలిచాయి. అందుకే మెదక్ పార్లమెంట్ నుంచి పోటీ చేసే అభ్యర్థిని ఎంపిక చేయడం కోసం తర్జనభర్జన పడుతున్నది.

కేసీఆర్, హరీశ్‌రావును ఎదుర్కొనే వారెవరు?

గతంలో కాంగ్రెస్‌కు బలంగా ఉన్న మెదక్ పార్లమెంట్ తెలంగాణ ఉద్యమం ఫలితంగా బీఆర్ఎస్‌కు పెట్టని కోటగా మారింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలలోనూ మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఐదింటిలో ఆ పార్టీ గెలిచింది. అంతేకాక ఈ పార్లమెంట్ నియోజకవర్గంలోనే ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఉన్నారు. వీరిని ఎదుర్కొని ఈ నియోజకవర్గంలో విజయం సాధించడం కోసం కాంగ్రెస్ ధీటైన అభ్యర్థిని ఎంపిక చేయాలని భావిస్తున్నది.

టికెట్ కోసం మైనంపల్లి, నీలం ప్రయత్నాలు

మెదక్ పార్లమెంట్ టికెట్ కోసం ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేరు వినవస్తున్నది. ఆయన గతంలో మెదక్ అసెంబ్లీ నుంచి ప్రాతినిధ్యం వహించగా, ప్రస్తుతం ఆయన కుమారుడు రోహిత్‌రావు ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. పైగా హన్మంతరావుకు ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో విస్తృత పరిచయాలున్నాయి. మైనంపల్లి హన్మంతరావు అభ్యర్థి అయితే విజయావకాశాలు ఉంటాయని స్థానిక కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. కాగా బీసీ నాయకుడైన పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన నీలం మధు కూడా కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలలో ఆయన పటాన్‌చెరు నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తే నియోజకవర్గంలో బీసీలందరూ మద్దతు ఇచ్చే అవకాశాలుంటాయని మధు పార్టీ నాయకత్వానికి వివరించినట్టు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం కొంతకాలంగా వీరిద్దరి పేర్లు మాత్రమే వినిపిస్తున్నాయి. వీరిద్దరిలో ఎవరిని ఎంపిక చేస్తుంది? గులాబీ కోటలో విజయం సాధిస్తుందా?



పవిత్ర మాసం రంజాన్

- సోమవారం నెలవంక దర్శనంతో ప్రారంభం
- నేటి నుంచి ఉపవాస దీక్షలు

మెదక్ కల్చరల్, మార్చి 11 : ముస్లింలు అత్యంత పవిత్రంగా ఆచరించే రంజాన్ మాసం వచ్చేసింది. సోమవారం నెలవంక కనిపించడంతో రాత్రి ప్రత్యేక ప్రార్థన(దువా), తరావీ నమాజ్‌తో ఉమ్మడి జిల్లాలోని ముస్లింలు రంజాన్ మాసానికి శుభారంభం పలికారు. మంగళవారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమవుతాయి. దివ్య గ్రంథం ఖురాన్ ఈ మాసంలోనే అవతరించడంతో రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. నెలవంక దర్శనం నుంచి 30 రోజుల పాటు ఉపవాసదీక్షను పాటిస్తారు. వేకువజామునే రోజువారీ సమయానుసారంగా సహరి తీసుకుంటారు. సాయంత్రం సూర్యాస్తమయం వరకు ఎలాంటి ఆహార పానీయాలు తీసుకోకుండా కఠోరదీక్షను పాటిస్తారు. తర్వాత (మగ్రిబ్) సూర్యాస్తమయం తర్వాత (ఇఫార్) దీక్షను విరమిస్తారు.

ప్రత్యేక నమాజ్ తరావీ

రంజాన్‌లో ఉపవాస దీక్ష(రోజా)లతో పాటు తరావీ నమాజ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. రాత్రి ఇషా నమాజ్ తర్వాత రంజాన్ మాసంలో 30 రోజుల పాటు తరావీ నమాజ్ చేస్తారు. ప్రత్యేక శిక్షణ పొందిన గురువులు రోజు తరావీ నమాజ్‌లో ఖురాన్ పఠిస్తారు. ఇస్లాం ముఖ్యంగా ఐదు సూత్రాలను ప్రబోధిస్తోంది. కల్మా(దేవుడు ఒక్కడేనని విశ్వసించడం) రోజుకు ఐదుసార్లు నమాజ్ చదవడం, రంజాన్ మాసం అంతా ఉపవాస దీక్షలు పాటించడం. జకాత్ రూపంలో రెండున్నర శాతం పేదలకు, పండగ చేసుకోలేని వారికి ఇవ్వడం చేయాలి. రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు విరమించే సమయంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు సోదరభావం పెంచుతుంది. ఉపవాస దీక్షలో ఉన్నవారికి ఎవరైతే ఇఫ్తార్ విందు ఇస్తారో వారికి అల్లాహ్ ఎన్నో రకాలైన మేలు చేస్తాడని నమ్మకం. రంజాన్ సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంతో పాటు గ్రామాలు, పట్టణాల్లో ఉన్న మసీదులు, వీధులను ప్రత్యేకంగా ముస్తాబు చేసారు. మసీదులు విద్యుత్‌కాంతులీనుతున్నాయి. మార్కెట్లలో ఖర్జూరాలు, ఇతర పండ్ల విక్రయాలు పెరిగాయి. పలుచోట్ల హలీం తయారీ దుకాణాలు వెలిశాయి.



యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం చేయండి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, మార్చి 11 : యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ఖాళీ సంచుల కొరత రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతాన్ని పరిశీలించే, తూర్పార బట్టే యంత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు తీసుకొచ్చే ధాన్యం తాలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా చూడాలన్నారు. జిల్లాలో ఐకేపీ సహకార సంఘాల ఆధ్వర్యంలో 84, పీఏసీఎస్ 76, డీసీఎంఎస్ 32 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. రైతులు తీసుకువచ్చే ధాన్యంలో తాలు లేకుండా ధాన్యం తూర్పారబట్టి కొనుగోలు కేంద్రాలకు తేవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పౌరసరఫరాల శాఖ డీఎం ప్రశాంత్, డీపీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకోండి

రెవెన్యూ అధికారులను ఆదేశించిన కలెక్టర్ క్రాంతి


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రభుత్వ పాఠశాల స్థలం ఆక్రమణపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 'కబ్జా కోరల్లో పాఠశాల స్థలం' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు పాఠశాలలో సందర్శించి ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కబ్జా చేసిన వారు ఎవరైనా ఉపేక్షించవద్దని, వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సమస్యలు విని.. భరోసా కల్పించి..

- మెదక్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి అర్జీలను స్వీకరించిన రాహుల్‌రాజ్
- ప్రజావాణికి 100 దరఖాస్తులు
- పెండింగ్‌లో 250 దరఖాస్తులు
- వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్

7లో



ప్రజావాణిలో అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

'పది'కి పకడ్బందీ ఏర్పాట్లు

- 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు
- మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల నిషేధం
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 11: పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం వివిధ శాఖల అధికారులతో పరీక్షల ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు మెదక్ జిల్లా వ్యాప్తంగా 68 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షలకు 10,300 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు ఆయన పేర్కొన్నారు. పరీక్షల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడిపించాలని, విద్యుత్ కోతలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ సామగ్రి అనుమతి లేదన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలన్నారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పని చేస్తాయన్నారు. ప్రతీ కేంద్రంలో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సిద్ధం చేయండి : కలెక్టర్

రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఈవీఎంల భద్రత, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదిత భవనాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ సోమవారం పరిశీలించారు. మెదక్‌లోని జూనియర్ కళాశాలను పరిశీలించి, ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఈవీఎంలను భద్రపరచడానికి తాత్కాలిక స్ట్రాంగ్‌రూంలను, అదనపు ఈవీఎల కోసం హాల్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

ఆసుపత్రి వరండాలో ప్రసవం

- అందుబాటులో లేని వైద్య సిబ్బంది
- ఆసుపత్రి గేటుకు తాళం

వెల్దుర్తి, మార్చి11 : వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఓ మహిళ ఆసుపత్రి వరండాలోనే ప్రసవించిన ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకున్నది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... వెల్దుర్తి గ్రామానికి చెందిన తాటి సృజన పురిటినొప్పులతో బాధపడుతుండడంతో కుటుంబసభ్యులు ఆదివారం అర్ధరాత్రి సమయంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి తీసుకెళ్లారు. ఆసుపత్రి గేటు లోపలివైపు తాళం వేసి ఉంది. ఆసుపత్రి లోపల సిబ్బంది నిద్రిస్తున్నారనే భావనతో పలుమార్లు కేకలు వేసినా ఎవరూ రాలేదు. ఆసుపత్రి పక్కన ఉన్న వారు సిబ్బంది ఎవరూ లేరని తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు గతంలో ఆసుపత్రిలో విధులు నిర్వహించిన మహిళా అటెండర్ సాయం తీసుకున్నారు. రాత్రి సమయంలో విధులు నిర్వహించాల్సిన ఏఎన్ఎం జయంతికి ఆశావర్కర్ సాయంతో సమాచారం అందించారు. ఆమె ఆసుపత్రికి వచ్చేలోపు గేటు వద్ద గర్భిణి ప్రసవవేదనతో బాధపడింది. ఆసుపత్రిలోని లేబర్ రూంకు తీసుకెళ్తుండగా నొప్పులు ఎక్కువరావడంతో ఆసుపత్రి వరండాలోనే ప్రసవించింది. ఆడశిశువుకు జన్మనిచ్చింది. చివరికి ఏఎన్ఎం వచ్చి తర్వాత సేవలు చేశారు. విధుల పట్ల అలసత్వం వహించిన ఏఎన్ఎం జయంతికి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం మెమో జారీ చేశారు.



ఆసుపత్రి వరండాలో ప్రసవించిన మహిళ



వైభవంగా 1008 నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠాపన

జహీరాబాద్, మార్చి 11 : పట్టణంలోని కైలాసగిరి శివాలయం వద్ద 1008 నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రోజుకు సుమారు 150 మంది దంపతులతో హోమం నిర్వహిస్తున్నారు. నేడు, రేపు కూడా హోమం కార్యక్రమం కొనసాగనున్నది. తొగుట పీఠాధిపతి మాధవానందస్వామి, బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహరాజ్, బావి పీఠాధిపతి సిద్ధేశ్వరస్వామి, ముంగి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరిమహరాజ్ హాజరయ్యారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఉత్సవకమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

నాగదేవత విగ్రహాలకు పూజలు చేస్తున్న దంపతులు

వేసవి కాలం.. జరభద్రం..!



- అప్పుడే ముదురుతున్న ఎండలు
- వడదెబ్బ తగిలే అవకాశం
- పగటి పూట ఎండలో తిరగొద్దు
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు

7లో



చల్లంగ చూడు తల్లి..

- ముగిసిన ఏడుపాయల జాతర
- తిరుగు ప్రయాణమైన భక్తులు
- జాతర ఆదాయం రూ.61.18 లక్షలు
- గతేడాది కంటే రూ.2.74 లక్షలు అదనం

7లో

ఏడుపాయల జాతర నుంచి ముల్లేమూటలతో తిరుగు పయనమైన భక్తులు

అంతర్ జిల్లాస్థాయి కబడ్డీలో విజేత చెక్కపల్లి జట్టు



టోర్నమెంట్ విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

హుస్నాబాద్‌రూరల్, మార్చి 11: మండలంలోని పోతారం(ఎస్)లో మూడు రోజులపాటు నిర్వహించిన అంతర్ జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన కబడ్డీ టీం టోర్నమెంట్ కప్‌ను సొంతం చేసుకున్నది. మూడు రోజులుగా నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్‌లో 56 జట్లు పాల్గొనగా, ఫైనల్ మ్యాచ్‌లో కేకేసీ పోతారం(ఎస్), చెక్కపల్లి కబడ్డీ టీంలు తలపడ్డాయి. ఫ్లడ్ లైట్స్ వెలుగుల్లో ప్రో కబడ్డీ పోటీలను తలపించే విధంగా నిర్వహించిన ఈ పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పోటీల్లో చెక్కపల్లి టీం ప్రథమ బహుమతిగా రూ. 20 వేల నగదును సొంతం చేసుకుంది. ద్వితీయ బహుమతిగా రూ. 15 వేలు పోతారం(ఎస్)కు చెందిన కేకేసీ జట్టు దక్కించుకున్నది. తృతీయ స్థానంలో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ రూ. 10వేల నగదు, నాలుగో స్థానంలో నిలిచిన మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ జట్టు రూ. 5 నగదును సొంతం చేసుకుంది. విజేతలకు కప్‌తో పాటు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో కబడ్డీ క్లబ్ మేనేజర్ మడక క్రిష్ణ, టోర్నమెంట్ దాతలు శంకరయ్య, మంజులారెడ్డి, మాజీ సర్పంచ్ బత్తిని సాయన్న, ఎంపీటీసీ శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



భద్రతాదళాలతో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

హుస్నాబాద్, మార్చి 11: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం సాయంత్రం హుస్నాబాద్ పట్టణంలో కేంద్ర భద్రతాదళాలు స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించాయి. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి మల్లెచెట్టు చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా మీదుగా ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. కార్యక్రమంలో ఏసీపీ సతీష్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు మహేష్, వివేక్, తిరుపతి తదితరులు ఉన్నారు

వైభవంగా స్వామివారి రథోత్సవం


రథోత్సవంలో భక్తులు

ఝరాసంగం, మార్చి 11: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. రథాన్ని వివిధ రంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మొదట ఆలయ గర్భగుడిలోని స్వామివారికి అభిషేకం, పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ప్రతిష్ఠించి బసవన్న ఆలయం వద్దకు తీసుకెళ్లారు.ఇక్కడ విగ్రహాలను రథంలో ఉంచి డప్పుచప్పుళ్లు, టపాసులు పేల్చుతూ ఊరేగింపు చేపట్టారు. ఈ ఊరేగింపు కక్కరవాడ శివారులోని బసవేశ్వర ఆలయం వరకు కొనసాగింది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ అధికారులు, ఆలయ సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

'పౌర సరఫరాల శాఖ పనితీరు ఆదర్శంగా ఉండాలి'

మెదక్, మార్చి 11: జిల్లాలో పౌర సరఫరాల శాఖ పనితీరు ఆదర్శంగా ఉండాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఖరీఫ్ 2023-24 బియ్యం డెలివరీ, రబీ 2022-23 టెండర్ అయిన ధాన్యంపై మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 30లోగా పెండింగ్ బియ్యం డెలివరీ పూర్తి చేయాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎం హరికృష్ణ, డీఎస్‌వో బ్రహ్మారావు, అరవిందొరెడ్డి, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు చంద్రపాల్, ప్రణీతరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి పాల్గొన్నారు.

సమస్యలు విని.. భరోసా కల్పించి..


సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

» ప్రజావాణికి వెల్లువెత్తిన విజ్ఞప్తులు

మెదక్ అర్బన్, మార్చి 11: కలెక్టరేట్లలో నిర్వహిస్తున్న ప్రజావాణికి వినతులు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో తొలిసారి మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి బాధితులకు భరోసా కల్పించేలా సాగింది. జిల్లా అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చారు. వారి నుంచి దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్, వారి విన్నపాలను ఆలకించారు. పరిష్కారానికి అవకాశమున్న ఆర్జీలను సంబంధిత అధికారులకు అందజేశారు. బాధితులు ఒకే సమస్యపై పదేపదే ప్రజావాణికి రాకుండా శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రజావాణికి 100 దరఖాస్తులు రాగా, అందులో రెవెన్యూశాఖ 35, డీఆర్‌డీవో 11, ఇతర శాఖలకు సంబంధించిన 54 వచ్చాయని తెలిపారు. ఇంకా పెండింగ్‌లో 250 దరఖాస్తులు ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి: మెదక్ ఎస్పీ

మెదక్ అర్బన్, మార్చి 11: పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డా. బాలస్వామి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాయలంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నంచి ఆర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు ఆర్జీలు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించండి

సంగారెడ్డి రూరల్, మార్చి 11: సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి బాధితులు పోటెత్తారు. కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఆర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ఇక్కడికి వస్తారని అన్నారు. ఆర్జీలను అధికారులు పరిష్కరిస్తే, ప్రజావాణిపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. కంది మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన సత్యమ్మ తన భర్త మృతి చెందాడని, అతని పేరు మీద ఉన్న భూమిని పౌతి మార్పులు చేసి పట్టా పాస్ బుక్కులు ఇప్పించాలని విన్నవించుకున్నారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల మధ్యలోని శ్మశానవాటికను తొలగించాలని గ్రామానికి చెందిన అంజిరెడ్డి ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో పంటి (డెంటల్) డాక్టర్‌ను నియమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ కోరారు. హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లి గ్రామంలో గ్రామకంఠం భూమి ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన ఆశన్నగౌడ్, సాయాగౌడ్, హరీష్‌గౌడ్‌లు కోరారు. వీటితో పాటు పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, భూ సమస్యలను పరిష్కరించాలని ఆర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో వసంతకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 59 వినతులు

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 11: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి దోహదపడుతుందని, ఆర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణిలో భూసంబంధిత, పింఛన్లు ఇతర మొత్తం కలపి 59 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జగదేవ్ ఆర్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్జీలు స్వీకరిస్తున్న సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మోదీ నాయకత్వంలో విశ్వగురువుగా భారత్

- కేంద్రంలో బీజేపీ హ్యాట్రిక్ ఖాయం
- 400 ఎంపీ స్థానాలే లక్ష్యం
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత మోదీదే
- కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్


కందిలో నిర్వహించిన మేధావుల సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్

కంది, మార్చి 11: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం విశ్వగురువుగా అభివృద్ధి చెందిందని కేంద్ర సాంస్కృతిక, న్యాయశాఖ సహాయమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కంది శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా బిల్లును పాస్ చేయించిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. అతి త్వరలో 33 శాతం మంది మహిళలకు ఎంపీ సీట్లు కేటాయిస్తామన్నారు. మోదీ ప్రధానిగా ఉంటేనే పరిశ్రమలు బాగుపడతాయని, వ్యవసాయరంగం మరింతగా అభివృద్ధి చెందుతుందని, దేశం పటిష్ఠంగా ఉంటుందని ఆయన తెలిపారు. చంద్రయాన్ సక్సెస్‌తో మన అంతరిక్ష టెక్నాలజీ ఎల్లలు దాటిందన్నారు. ప్రపంచదేశాలన్నీ భారత్ వైపే చూస్తున్నాయని, అంతగా టెక్నాలజీ పరిశోధనలు అభివృద్ధి చెందాయని కొనియాడారు. ఆయూష్ ద్వారా కోవిడ్ సమయంలో దేశం మొత్తానికి వ్యాక్సిన్ అందించి మోదీ అందరిలో ధైర్యాన్ని నింపారని గుర్తుచేశారు. 370 ఆర్టికల్ రద్దు చేయడం దేశం గర్వించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు. అనేక కొత్త చట్టాలు, ఎన్నో సంస్కరణలు చేసిన మోదీ పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతుందన్నారు. దేశ ఆర్థికవ్యవస్థను 5 ట్రిలియన్లకు పెంచడమే లక్ష్యంగా ప్రధాని కృషి చేస్తున్నారని వివరించారు. రానున్న రోజుల్లో ప్రాంతీయ భాషను న్యాయస్థానాల్లో అమలు చేస్తామన్నారు. కేంద్రంలో ఈసారి కూడా బీజేపీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 400 ఎంపీ స్థానాల గెలుపొందడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలన్నారు. ప్రతీ గడపకు మోదీ దేశానికి చేసిన అభివృద్ధి పనులు వివరించాలని కోరారు. ఈ సదస్సులో ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, నాయకులు పులిమామిడి రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ వైద్యనాథ్, డాక్టర్ రాజుగౌడ్, నాగరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

- కుదుట పడని బాలుడి ఆరోగ్యం
- పోలీసులను ఆశ్రయించిన బాధిత కుటుంబం
- ఉపాధ్యాయుడికి అండగా ఉపాధ్యాయ సంఘాలు


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు

టేక్మాల్, మార్చి 11: విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన టేక్మాల్‌లో చోటు చేసుకున్నది. మండలంలోని ధనుర గ్రామానికి చెందిన కుమార్, అనిత దంపతుల కుమారుడు మనోహర్(6) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చంద్రప్రకాష్ రెండునెలల క్రితం బాలుడిని చితకబాదడంతో కాలు విరిగి నడవలేని స్థితిలో ఉండగా.. తల్లిదండ్రులు సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఇచ్చి.. విద్యార్థికి పూర్తిగా నయం అయ్యేవరకు తాను ఖర్చులు భరిస్తానని, అధికారులకు ఫిర్యాదు చేయొద్దని కోరాడు. అయితే విద్యార్థి ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడా రెండు నెలలుగా చికిత్స చేయించినా నడవలేని స్థితిలో ఉండడంతో తమకు న్యాయం చేయాలని బాలుడికి కుటుంబీకులు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఉపాధ్యాయుడికి సమాచారం అందివ్వగా.. ఆయనకు అండగా ఉపాధ్యాయ సంఘాలు రాజీకి ప్రయత్నాలు చేస్తున్నట్లు బాధిత కుటుంబం పేర్కొన్నది.

ఇంటర్ పరీక్షల్లో ఇద్దరిపై మాల్ ప్రాక్టీస్ కేసు: డీఐఈవో

సంగారెడ్డి అర్బన్, మార్చి 11: ఇంటర్మీడియట్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదైంది. జోగిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఇద్దరిని డిబార్ చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కాగా సోమవారం ఇంటర్ ఫస్టియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 52 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 19,961 మందికి 19,017 మంది హాజరుకాగా, 944 మంది గైర్హాజరయ్యారు. 95.27 హాజరు శాతం నమోదైంది.

వ్యవసాయ మార్కెట్‌లో కొలువుదీరిన పాలకవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గం

జహీరాబాద్, మార్చి 11: జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సోమవారం కొలువుదీరింది. ముందుగా వ్యవసాయ మార్కెట్ కార్యాలయానికి నూతనంగా ఎన్నికైన చైర్మన్ ఆగమ సాయిచరణ్ రావడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు, నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అందులో భాగంగా చైర్మన్‌ను చైర్మన్ కార్యాలయానికి తీసుకెళ్లి శాలువాలు, పూలమాలతో అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ అధికారి చాయాదేవి, స్థానిక ద్వితీయశ్రేణి కార్యదర్శి అనిల్‌బాబు నూతనంగా ఎన్నికైన చైర్మన్ ఆగమ సాయిచరణ్, సభ్యులతో సమావేశమై మార్కెటింగ్‌శాఖ విధివిధానాల గురించి వివరించారు. మార్కెట్ కార్యాలయం ముంగిట నూతనంగా ఎన్నికైన చైర్మన్‌కు క్రేయిన్‌తో గజమాలను వేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సుభాష్‌గంజ్‌లో గల వేదికపై చైర్మన్, సభ్యులతో కలిసి జిల్లా వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ అధికారి చాయాదేవి ప్రమాణ శ్రీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ ఆగమ సాయిచరణ్ మాట్లాడుతూ జహీరాబాద్ వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను అందరి సహకారంతో అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తల్లిదండ్రులు, మాజీమంత్రి డా.చంద్రశేఖర్, ప్రమీల, జిల్లా నాయకుడు ముల్తానీపాటిల్, జడ్పీటీసీ నాగిశెట్టిరాథోడ్, నాయకులు నర్సింహారెడ్డి, కండెం నర్సింహులు, హుగ్గెల్లి రాములు పాల్గొన్నారు.

చల్లంగ చూడు తల్లి..

- ముగిసిన ఏడుపాయల జాతర

పాపన్నపేట, మార్చి 11: వెళ్లొస్తాం.. వచ్చే ఏడాది మళ్లొస్తాం.. చల్లంగా చూడు తల్లి అంటూ దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు జాతర నుంచి సోమవారం తిరుగు ప్రయాణమయ్యారు. మహా శివరాత్రి సందర్భంగా ప్రారంభమైన ఏడుపాయల జాతర ముగిసింది. మూడు రోజులపాటు జరిగిన జాతర జిల్లాస్థాయి అధికారుల సమన్వయంతో ప్రశాంతంగా జరిగింది. జాతరలో 50కి పైగా పిల్లలు తప్పిపోగా పోలీసులు వారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పజెప్పారు. జాతరలో అక్రమంగా మద్యం అమ్ముతున్న 5 బెల్ట్‌షాప్‌లపై కేసులు నమోదు చేశారు. ఆదివారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన రవి దుర్గమ్మ దర్శనానికి వచ్చి ఏడుపాయల్లోని రెండో బ్రిడ్జి వద్ద నీట మునిగి చనిపోయాడు. ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, పారిశుధ్య కార్మికులు జాతరలో సేవలందించారు.

ఆదాయం రూ.61..18 లక్షలు

గత ఏడాది కంటే రూ.2లక్షల 74వేలు అదనం

ఏడుపాయల వనదుర్గ భవానీ జాతర ముగిసిన నేపథ్యంలో భక్తులు సమర్పించిన కానుకలను, హుండీలను లెక్కించారు. మహాజాతర సందర్భంగా రూ.61లక్షల 18వేల ఆదాయం సమకూరినట్లు చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్ రెడ్డి వెల్లడించారు సోమవారం గోకుల్ షెడ్‌లో హుండీలో లెక్కింపు చేపట్టారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ ఇన్‌స్పెక్టర్ రంగారావు పర్యవేక్షణలో భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు హుండీలను లెక్కించగా, 14 రోజులకు గానూ రూ. 24 లక్షల 75 వేల 366 నగదు వచ్చిందన్నారు. ఒడిబియ్యం ద్వారా రూ. 77వేల 950, కేశ ఖండన ద్వారా రూ. 59వేల 250, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 9 లక్షల 95 వేల 720 ఆదాయం వచ్చింది. లడూడ విక్రయం ద్వారా రూ. 17 లక్షల 70, పులిహోర ద్వారా రూ. 7 లక్షల 39 వేల 900ల ఆదాయం వచ్చింది. గతేడాది కంటే ఈ జాతరకు రూ. 2 లక్షల 74 వేల 403లు అదనంగా ఆదాయం సమకూరినట్లు ఆలయ చైర్మన్ బాలాగౌడ్ వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపులో పాలకమండలి సభ్యులు వెంకటేశం, మనోహర్, యాద గౌడ్, బాగా రెడ్డి, శ్రీనివాస్ రావు, సాయిలు, పెంటయ్య, చక్రపాణి, రఘువీర్, మోహన్ రావు, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

కల్హేర్‌లో అలరించిన కుస్తీ పోటీలు


కల్హేర్, మార్చి 11: మండల కేంద్రమైన కల్హేర్‌లోని భద్రప్పస్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల ఆఖరు రోజైన సోమవారం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. ఈ సందర్భంగా సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు చెందిన మల్లయోధులే కాకుండా సరిహద్దున ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. ఆఖరి కుస్తీలో విజయం సాధించిన మల్లయోధుడికి 5 తులాల వెండి కడియం, రూ.1111 నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు ముదాళం వీరశెట్టి, పబ్బతి మహిపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన తహసీల్దార్

హత్నూర, మార్చి 11: 'ఉడికి ఉడకని అన్నం తినేది ఎట్లా..!' అనే శీర్షికన ఈనెల 9న ఆంధ్రజ్యోతి ప్రచురితమైన కథనానికి హత్నూర తహసీల్దార్ ఫర్హీన్ షేక్ స్పందించారు. మండల కేంద్రమైన హత్నూరలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సోమవారం సందర్శించి, విద్యార్థుల కోసం వండిన అన్నం, కూరగాయలను పరిశీలించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, లేనియెడల చర్యలు తప్పవని అక్కడి సిబ్బందిని హెచ్చరించారు.

వేసవి కాలం.. జరభద్రం..!

» వడదెబ్బ తగిలే అవకాశం.. » జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు


శివ్వంపేట: శివ్వంపేటలో టబ్బులో ఆడుకుంటున్న బాలుడు

చిన్నకోడూరు, మార్చి 11 : అప్పుడే ఎండలు ముదురుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే మండిపోతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపం చూపుతున్నాడు. దీంతో జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. తాత్కాలిక ఉపశమనం కోసం జ్యూస్‌లు, కొబ్బరినీళ్లు, కూల్ డ్రింక్స్ తాగుతున్నారు. ఇంత చేసినా.. అత్యవసర పనులు, ఉద్యోగం, ఉపాధి కోసం బయటకు రాకుండా ఉండలేని పరిస్థితి. అయితే, ఎండలో తిరిగితే వడ దెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, పగటి పూట ఎండలో తిరగకూడదని, వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు..

- వడదెబ్బ తగిలిన వ్యక్తికి తీవ్రమైన జ్వరం, తలనొప్పి, బీపీ తగ్గిపోయి కళ్లు తిరిగి పడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి.
- చర్మం ఎర్ర బడటం
- నాలుక తడి ఆరిపోవడం
- కొందరికి వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఉంటుంది.

ప్రథమ చికిత్స...

- వడ దెబ్బ తాకిన వ్యక్తిని ముందుగా ఎండలో నుంచి నీడలోకి చేర్చాలి.
- ఉప్పు కలిపిన నీటిని, మజ్జిగ, కొబ్బరి నీళ్లు తాగించాలి.
- తడి వస్త్రంతో చర్మం పై తుడవాలి.

అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి...



వేసవి కాలంలో అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకూడదు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే తలకు టోపీ ధరించాలి, లేదా వెంట గొడుగు తీసుకెళ్లాలి. వడ దెబ్బ తగిలిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించి, వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలి.

-డాక్టర్ సరిత, పీహెచ్‌సీ వైద్యురాలు, చిన్నకోడూరు

ముందస్తు జాగ్రత్తలు...

- మధ్యాహ్నం సమయంలో ఎండలో తిరగకూడదు.
- అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ, లేదా రూమాలు ధరించాలి. వెంట గొడుగు తీసుకెళ్లాలి.
- నల్లని దుస్తులు ధరించకూడదు

ఎస్‌బీఐ బీజేపీ బ్యాంకు కాదు



సంగారెడ్డిలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్/నారాయణఖేడ్/జహీరాబాద్, మార్చి 11: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బీజేపీ బ్యాంకు కాదని, ఎన్నికల బాండ్ల వివరాలు బయట పెట్టకుండా ఎందుకు దాస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ ప్రశ్నించారు. సంగారెడ్డిలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందు సోమవారం సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల వివరాలను బయట పెట్టాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం, మల్లేశం, రాజయ్య పాల్గొన్నారు. ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్ అన్నారు. సోమవారం నారాయణఖేడ్ ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం బ్యాంకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బీఐ బయట పెట్టాల్సిందేనని సీపీఎం జిల్లా నాయకులు మైపాల్ పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందు ఆందోళన చేపట్టారు.

బీజేపీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేయాలి: ఆనంద్‌గౌడ్

నర్సాపూర్, మార్చి 11: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మెదక్ అభ్యర్థి గెలిచేలా ప్రతిఒక్క బీసీ కార్యకర్త కృషి చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్‌లో నిర్వహించిన ఓబీసీ మోర్చా సామాజిక సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త మోదీ ఆధ్వర్యంలో బీజేపీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.చిన్నరమేష్‌గౌడ్, కౌన్సిలర్లు రాజేందర్, సురేష్ పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, మార్చి 1: సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ మండలంలో వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. నారాయణఖేడ్ పట్టణంలో పదేళ్ల క్రితం గత ప్రభుత్వం బాలసదనం చిన్నారుల సౌలభ్యం కోసం నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, అయినా పనులు పూర్తి చేయలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం తాము రూ.1.35 కోట్లు మంజూరు చేయించి, పనులు ప్రారంభించామన్నారు. పట్టణంలో రూ.5 కోట్లతో ప్రధానమైన బైపాస్ రోడ్డు పనులను ప్రారంభించామని తెలిపారు. అలాగే పొట్టి శ్రీరాములు చౌక్ నుంచి కోర్టు వరకు రూ.2 కోట్లతో రోడ్డు పనులను చేపట్టామన్నారు. లింగాపూర్‌లో ఐకేపీ ద్వారా మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్డీవో జ్యోతి, గిరిజన ప్రాజెక్టు అధికారిణి లలితాకుమారి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ గుప్తా, ఆర్డీవో అశోక చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తాహేర్ అలీ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ చాలా ముఖ్యమైందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మోర్గి మోడల్ కళాశాల వార్షికోత్సవానికి హాజరై మాట్లాడారు. మోడల్ కళాశాలలో విద్యనభ్యసించి ఇటీవల అనేక మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సృష్టించారన్నారు. నేటి విద్యార్థులు వారికి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు త్వరలో రూ.2 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను కళాశాల సిబ్బంది, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి, నాయకులు పాల్గొన్నారు.



ఖేడ్‌లో బాల సదనం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్

ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు అందించాలి: ఎమ్మెల్యే

కౌడిపల్లి/నర్సాపూర్/శివ్వంపేట/వెల్దుర్తి, మార్చి 11: ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు అందించాల్సిన అవసరం ఉన్నదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ రాజునాయక్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించొద్దన్నారు. వేసవిలో పంటలు ఎండిపోకుండా రైతులకు సకాలంలో విద్యుత్ అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, జడ్పీటీసీ కవితాఅమర్‌సింగ్, ఎంపీటీసీలు ప్రవీణ్, జ్యోతిరాజు పాల్గొన్నారు. యువత ఉద్యోగాలే కాకుండా ఉపాధివైపు మొగ్గుచూపడం అభినందనీయమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ మండలంలోని పెద్దచింతకుంట సమీపంలో పలువురు యువకులు కలిసి రెస్టారెంట్ ఏర్పాటు చేయగా దానిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ మన్సూర్, నాయకులు పాల్గొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలోనే తండాలు అన్నివిధాలుగా అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే సునితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం శివ్వంపేట మండలంలోని చండి నుంచి రూప్‌సింగ్ తండా వరకు రూ.2.20 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హరికృష్ణ, జడ్పీటీసీ మహే‌ష్‌గుప్తా, జడ్పీ కో ఆప్షన్ మన్సూర్, నాయకులు చంద్రాగౌడ్, వెంకట్రామ్‌రెడ్డి, రమణాగౌడ్ పాల్గొన్నారు. బీరప్ప దీవెనలతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే సునితారెడ్డి అన్నారు. వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరి గ్రామంలో నిర్వహిస్తున్న బీరప్ప జాతరలో ఆమె పాల్గొని పూజలు నిర్వహించారు. వెల్దుర్తి నుంచి శేరి గ్రామానికి రోడ్డు నిర్మించాలని, గ్రామంలోని మల్లన్న ఆలయ నిర్మాణానికి తనవంతు కృషి చేయాలని ఎమ్మెల్యేను శేరి గ్రామస్థులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు, ఆలయ నిర్మాణానికి కృషి చేస్తానని హామీఇచ్చారు. జడ్పీటీసీ రమే‌ష్‌గౌడ్, వెల్దుర్తి ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



స్వామి(ఫైల్)

చేగుంట, మార్చి 11: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేగుంట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన స్వామి(35) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడునెలల క్రితం భార్యాభర్తలకు మధ్య గొడవ జరిగి.. భార్య కల్యాణి పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మనస్తాపం చెందిన స్వామి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత, ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు, లారీ

సంగారెడ్డి క్రైమ్, మార్చి 11: ప్రభుత్వం పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న లారీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం రింజిమ్ దాబా వద్ద ఆదివారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన లారీని తనిఖీ చేయగా 35,470 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. గుజరాత్‌లోని ద్వారకాకు చెందిన వి.సాగర్‌బాయ్(28), పరమార్‌వక్క(19)లను అదుపులోకి తీసుకున్నారు. బియ్యాన్ని సీజ్ చేసి పటాన్‌చెరు పోలీసులకు అప్పగించారు.

రెండు ఇసుక లారీలు సీజ్

సంగారెడ్డి క్రైమ్, మార్చి 11: పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు లారీలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. కంది మండలం హనుమాన్‌నగర్‌కు శంకర్‌నాయక్ ఫిల్టర్ బెడ్ వద్ద మట్టిని తవ్వి వడకట్టి అందులోంచి ఇసుకను వేరు చేస్తూ అక్రమంగా రవాణా చేస్తున్నాడు. ఈ క్రమంలో పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద లారీని పట్టుకుని బీదర్ జిల్లాకు చెందిన లారీ డ్రైవర్లు ఎం.కంశెట్టి(33), సైలాని సాబ్‌పాటిల్(37)లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయంలో నల్లాల చోరీ



చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కంది, మార్చి 11: కంది మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం దొంగలు పడ్డారు. బాత్‌రూమ్‌లోని నల్లాలను చోరీ చేశారు. ఎంపీడీవో కార్యాలయం వెనక భాగంలో ఉన్న బాత్‌రూమ్‌లో తలుపులు విరగ్గొట్టి నల్లాలను దొంగిలించుకుపోయారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సంగారెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కాగా ఎంపీడీవో కార్యాలయంలో సీసీ కెమెరాలు లేకపోవడం వల్లనే దొంగతనం జరిగిందని పలువురు చర్చించుకుంటున్నారు.

బొల్లారంలో అక్రమ కట్టడాల కూల్చివేత

జిన్నారం, మార్చి 11: బొల్లారం మున్సిపాలిటీ ప్రభుత్వ భూమిలో నిర్మించిన పలు కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సోమవారం తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ, సర్వేయర్ రామభద్రం బొల్లారంలో పర్యటించారు. 284 సర్వే నెంబరులో నిర్మించిన పలు గదులు, ప్రహరీలను ఎక్స్‌కవేటర్‌తో కూల్చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి, నిర్మాణాలు జరిపితే కఠిన చర్యలు చేపడుతామని తహసీల్దార్ హెచ్చరించారు.

'సమయ పాలనతో ఉపాధిహామీ పనులు చేయాలి'

నారాయణఖేడ్, మార్చి 11: సమయ పాలనతో ఉపాధిహామీ పనులు చేయాలని డీఆర్డీవో పీడీ జ్యోతి సూచించారు. సోమవారం మండల కేంద్రమైన నిజాంపేటలో ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీల వద్దకెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నందున ఉదయం 7 నుంచి 12 గంటల వరకు పనులు చేయాలని సూచించారు. ఆమె వెంట ఏపీవో మాణిక్‌రావు, మాజీ సర్పంచు జగన్‌చారి, మాజీ ఉప సర్పంచు రాజీబాయిరాంచందర్, టీఏ ప్రహ్లాద్, ఫీల్డ్ అసిస్టెంట్ నరేందర్, తదితరులు ఉన్నారు.

1764 ధరణి దరఖాస్తులకు పరిష్కారం

నారాయణఖేడ్, మార్చి 11: ఖేడ్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ధరణి ప్రక్షాళనలో భాగంగా 2,382 దరఖాస్తులు రావడంతో, అందులో ఈనెల 1 నుంచి 9వ తేదీవరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 1,764 సమస్యలను పరిష్కరించినట్లు ఆర్డీవో అశోకచక్రవర్తి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూసంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవకాశం కల్పించడంతో వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కరించామన్నారు. మరో 618 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

సురేష్ షెట్కార్‌కు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సన్మానం



సురేష్‌షెట్కార్‌ను సన్మానిస్తున్న మదన్‌మోహన్‌రావు

నారాయణఖేడ్, మార్చి 11: ఖేడ్‌కు చెందిన మాజీ ఎంపీ, జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ సోమవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డికి వెళ్లారు. అక్కడ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఆ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డిలను వారివారి స్వగృహాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నందుకు వారు షెట్కార్‌ను అభినందించి శాలువాలతో సన్మానించారు. షెట్కార్ వెంట ఆయన కుమారుడు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్ ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

● జిల్లా మహిళా, శిశుసంక్షేమ శాఖ అధికారి లలితకుమారి

నారాయణఖేడ్, మార్చి 11: విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి అన్నారు. సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీవో సుజాత, అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షకులు, కార్యాలయ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం, బాలామృతం సక్రమంగా అందించాలన్నారు. తక్కువ బరువు ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు సమయ పాలన పాటిస్తూ సక్రమంగా విధులు నిర్వర్తించేలా పర్యవేక్షించాలన్నారు.

రూ.23.10 లక్షలకు నర్సాపూర్ తైబజార్ వేలం

నర్సాపూర్, మార్చి 11: నర్సాపూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం తైబజార్ వేలం నిర్వహించినట్లు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. ఈ వేలంలో సందీప్ అనే వ్యక్తి రూ.రూ.23.10 లక్షలకు పాట పాడి దక్కించుకున్నాడు. పశువుల సంతను చింతకుంట శ్రీకాంత్ అనే వ్యక్తి అత్యధికంగా రూ.1.55 లక్షలకు పాడి దక్కించుకున్నారు. కాగా పశు వధశాలకు ఎవరూ రాకపోవడంతో 13వ తేదీకి వాయిదా వేసినట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్లు యాదగిరి, రామచంచందర్, నాయకులు రమే‌ష్‌యాదవ్, దావుద్, ఆంజనేయులుగౌడ్, భిక్షపతి, సిబ్బంది నగేష్, సల్లా మురళి పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ఆర్టీసీ కార్మికుల సంబురాలు

సంగారెడ్డి అర్బన్, మార్చి 11: సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ కార్మికులకు 21 శాతం పీఆర్సీ ఫిట్‌మెంట్ ప్రకటించడం పట్ల సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపో ఆవరణలో సోమవారం ఆర్టీసీ కార్మికులు సంబురాలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోపాజి అనంతకిషన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు, ఉద్యోగులు, కార్మికులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఉపేందర్, కాంగ్రెస్ నాయకులు సంతోశ్, కిరణ్, రాజు, ప్రదీప్, ఉదయ్, శ్రీకాంత్, వెంకట్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు ప్రభుత్వం పెద్దపీట

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీనర్సమ్మ, సంతోష

కొల్చారం, మార్చి 11: బాలికా విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీనర్సమ్మ, సంతోష అన్నారు. కొల్చారం కస్తూర్బా గాంధీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం 'బేటి బచావో.. బేటి పడావో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రన్నింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది లక్ష్మి, వినోదారాణి, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమాచారం

ముగిసిన ఉర్సు

వట్‌పల్లి, మార్చి 11: వట్‌పల్లిలోని 39వ ఆరాధన ఉర్సు ఉత్సవాలు సోమవారం ఖురాన్‌గ్రంథ పఠన, సమసమాప్త ఆరాధన, ఖవ్వాలి ప్రసాద వితరణ కార్యక్రమాలతో ముగిసినట్లు ట్రస్టు ఉపాధ్యక్షుడు రాములు చిస్తి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి దర్గాను దర్శించుకుని గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ట్రస్టు నిర్వాహకులు శాలువా, పూలమాలతో సన్మానించి, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వరం కమిటీ అధ్యక్షుడు వీరారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన బీరయ్యయాదవ్

సంగారెడ్డి రూరల్: కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశంను సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బీరయ్యయాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీరయ్యయాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో గొల్ల, కురుమల సామాజిక రాజకీయ చైతన్యం కోసం డోల్ దెబ్బ బహిరంగ సభలు నిర్వహించానని గుర్తుచేశారు.

మహిళా సొసైటీ పేరుతో డబ్బుల వసూలు తగదు

కౌడిపల్లి: మత్స్యశాఖలో మహిళా సొసైటీ పేరుతో రూ.1500 డబ్బుల వసూలు తగదని జిల్లా మత్స్యశాఖ అడహక్ కమిటీ డైరెక్టర్ గాండ్ల క్రిష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మల్లన్న జాతర పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

జిన్నారం, మార్చి 11: పెద్దమ్మగూడెంలో నిర్వహించే మల్లికార్జునస్వామి జాతర పోస్టర్‌ను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పెద్దమ్మగూడెం గ్రామానికి చెందిన నాయకులు వెంకటేశ్‌యాదవ్, మహేష్, సత్తన్న, మల్లేశ్, ప్రహ్లాద్, యాదయ్య సాయికుమార్‌లు ఎమ్మెల్యేను కలిసి దేవాలయ ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈనెల 17నుంచి జరిగే ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

వెంచర్ పనులు నిలపాలని తీర్మానం

నర్సాపూర్: బీజేపీ కౌన్సిలర్ సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నర్సాపూర్ మున్సిపల్ పాలకవర్గం వెంచర్ పనులు నిలిపివేయాలని తీర్మానం చేసినట్లు చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు.

అధికారులు సమయ పాలన పాటించరా?

● సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిలదీత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మనోజ్‌రెడ్డి, పాల్గొన్న సభ్యులు

కొండాపూర్, మార్చి 11: సర్వసభ్య సమావేశానికి అధికారులు సమయ పాలన పాటించరా అని జడ్పీటీసీ నర్సింహారెడ్డి ప్రశ్నించారు. వారు వచ్చేవరకూ సమావేశం జరపొద్దని భీష్మించారు. సోమవారం ఎంపీపీ మనోజ్‌రెడ్డి అధ్యక్షతన మండల స్థాయి సర్వసభ సమావేశం ఎంపీడీవో జ్యోతిలక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వచ్చే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కాంతయ్య మాట్లాడుతూ పదవి చేపట్టి ఐదేళ్లయినా పూర్తిస్థాయి అధికారులు రాలేరని, సభ్యులుగా మాకు ప్రోటోకాల్ విలువ కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ఇరిగేషన్‌లో జరిగిన అక్రమాలపై స్పందన లేదని, రుజువులున్నా డిపార్ట్‌మెంట్ చర్యలు లేవని ప్రశ్నించగా కోర్టు పరిధిలో ఉందని ఏఈ సమాధానం ఇచ్చారు. డీఈవో యక్షన్ ప్లాన్ ప్రకారం 18న జరిగే పది పరీక్షలకు ఏబీసీడీ వర్గాలుగా పెట్టి పరీక్షలు ఉత్సాహంగా రాసేటట్లు విద్యార్థులను ప్రిపేర్ చేసినట్లు ఎంఈవో భీంసింగ్ తెలిపారు. అనంతరం పదవీ బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అనిత, ఎంపీటీసీ గీతామోహన్, మమతాగోవర్ధన్ రెడ్డి, లక్ష్మీరాంచందర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీకాంత్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

వన దుర్గామాతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



దుర్గమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దంపతులు

పాపన్నపేట/చిన్నశంకరంపేట, మార్చి 11: ఏడుపాయల వనదుర్గామాతను మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మర్యాదల ప్రకారం చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి వారిని సత్కరించారు. ఆయన వెంట కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమే‌ష్‌గుప్తా, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గోవింద్‌నాయక్, నాయకులు ఉన్నారు. స్వామివారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు వేడుకున్నారు. చిన్నశంకరంపేట మండలంలోని రుద్రారం గ్రామంలో సోమవారం కేతకీ సంగమేశ్వరస్వామిని హనుమంతరావు దంపతులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు సతీమణి వాణి, ఎంపీపీ భాగ్యలక్ష్మి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి: జడ్పీటీసీ

కొల్చారం, మార్చి 11: మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని జడ్పీటీసీ మేఘమాల అన్నారు. కొల్చారం మండలం వరిగుంతం జడ్పీ హైస్కూల్‌లో హూర్న్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అంగన్‌వాడీ, ఆశావర్కర్లకు శాలువాలతో సత్కరించారు.

నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి

నిజాంపేట, మార్చి 11: ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి అన్నారు. మండల పరిధిలోని నస్కల్ గ్రామంలోని ఎస్సీ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిషన్ భగీరథ నల్లాలకు ప్రవాహ నియంత్రణ కవాటం తొలగించడం ద్వారా కొంతమందికి తక్కువగా వస్తుందని, నల్లాలను పరిశీలించి నీటి సమస్య రాకుండా చూస్తామన్నారు. కాలనీలో ఉన్న బోరు మోటార్‌ను రిపేర్‌చేసి అందుబాటులోకి తెస్తామన్నారు.

ఆరు గ్యారంటీలు, 13 హామీలకు ఆరురోజులే గడువు: హరీశ్‌రావు



శివాజీ విగ్రహవిష్కరణలో మాజీ మంత్రి హరీశ్‌రావు

తూప్రాన్, మార్చి 11: 100 రోజుల్లో 6 గ్యారంటీలు 13 హామీలు అమలుకు ఆరురోజుల గడువే ఉన్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో సోమవారం రాత్రి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఆరు రోజుల్లో 13 హామీలు అమలు చేయకుంటే అడ్డుకునుడేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ రాణిసత్యనారాయణగౌడ్, తాజా మాజీ సర్పంచ్ వెంకటమ్మ, విగ్రహదాత లంబ రమేష్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

'జగదాంబ విగ్రహాన్ని అప్పగించాలి'

చేగుంట, మార్చి 11: జగదాంబ విగ్రహాన్ని అప్పజెప్పాలని గిరిజనులు సోమవారం చేగుంట తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ సంఖ్యలో వచ్చి ఆందోళనకు దిగారు. రెండురోజుల క్రితం గిరిజనులు ఏర్పాటు చేసుకున్న విగ్రహాన్ని తీసుకెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో ఉంచారు. విషయం తెలుసుకున్న గిరిజనులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. రామాయంపేట సీఐ వెంకటేష్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు హరినాయక్ కల్పించుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి జగదాంబ విగ్రహాన్ని ఇప్పించడంతో ఆందోళన విరమించారు. కార్యాలయ ఆవరణలో ఎలాంటి అవాంఛనీయల సంఘటనలు జరగకుండా ఎస్ఐలు బాలరాజ్, నాగయ్య, శ్రీనివాస్‌రెడ్డి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు సుభాష్, చక్రాసింగ్, రాజు, బద్యా పాల్గొన్నారు.

ముగిసిన సోమేశ్వరస్వామి జాతర



చండికాంబ సోమేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

చిన్నశంకరంపేట, మార్చి 11: చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని సోమేశ్వర స్వామి జాతర 53వ వార్షికోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలోని చండికాంబ సోమేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితులు సంఘమేశ్వరశర్మ, శివశక్తి పూజలు చేశారు. కల్యాణంలో తాజా, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

అటు రైతుబంధు తీసుకుంటూ.. ఇటు ఇళ్లు కట్టుకుంటున్నారు

● మండల సభలో జడ్పీటీసీ మండిపాటు



మాట్లాడుతున్న జడ్పీటీసీ రమేశ్, పక్కన ఎంపీపీ అధ్యక్షుడు బాలయ్య

జోగిపేట, మార్చి 11: గ్రామాల్లో నాలా కన్వర్షన్ జరగకుండానే బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా.. పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని జడ్పీటీసీ కే.రమేష్ ఆరోపించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షుడు జోగు బాలయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ ఓవైపు తమ భూమికి రైతుబంధు తీసుకుంటున్న కొందరు అదేస్థలంలో నాలా కన్వర్షన్ చేయించుకోకుండానే ఇళ్లు నిర్మించుకుంటున్నారన్నారు. మండలంలోని గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయని వాపోయారు. ఈ విషయమై అటు పోలీసులు, ఇటు ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మద్యం, గంజాయిని అరికట్టకపోతే యువత భవిష్యత్ ఆగమయ్యే పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని నేరడిగుంట ఎంపీటీసీ లవ్య క్రిష్ణాగౌడ్ కోరారు. ఇదిలా ఉండగా మండల సభకు కేవలం ఐదురుగు సభ్యులు మాత్రమే హాజరవడం గమనార్హం. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

గురుపాదప్పగుట్ట ఆలయంలో ప్రత్యేక పూజలు

పెద్దశంకరంపేట, మార్చి 11: మహాశివరాత్రి కార్యక్రమాలలో భాగంగా గురుపాదప్పగుట్ట భ్రమరాంబ మల్లికార్జున ఆలయంలో సోమవారం పుణ్యాహవచనం, హోమం, స్వామివారికి రుద్రాభిషేకం, ఆకుల పూజ, అన్నపూజ, గణపతి వచనం తదితర పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం 11.45 గంటలకు భ్రమరాంబ మల్లికార్జున కల్యాణం, సాయంత్రం 4 గంటలకు బండ్లు తిరుగు కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, బలరాంసంగమేశ్వర్ పాల్గొన్నారు.

మేమందరం మోదీ కుటుంబ సభ్యులమే

● బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి పులిమామిడిరాజు



సంగారెడ్డి పాత బస్టాండ్ వద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 11: సంగారెడ్డిలోని పాత బస్టాండ్ వద్ద బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి ఆధ్వర్యంలో 'మేమూ నరేంద్రమోదీ కుటుంబసభ్యులమే' అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి పులిమామిడిరాజు మాట్లాడుతూ ప్రతిపక్షాలు మోదీకి కుటుంబమే లేదని విమర్శించడం సరికాదన్నారు. దేశంలోని 140 కోట్ల మంది భారతీయులందరూ మోదీ కుటుంబసభ్యులేనన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగరాజు పాల్గొన్నారు.

●కల్హేర్: బీహార్ మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్ ప్రధానికి కుటుంబమే లేదని మోదీపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయన మా కుటుంబసభ్యుడే అంటూ బీజేపీ నాయకులు సోమవారం కల్హేర్‌లో ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు ఎన్నం అనిల్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సంగమేశ్వర్‌రావ్, చంద్రయ్య, సాయిలు పాల్గొన్నారు.

●జిన్నారం: జిన్నారంలో బీజేపీ మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి, జిల్లా నాయకులు ప్రతాప్‌రెడ్డి, నర్సింగరావుల ఆధ్వర్యంలో 'మేమందరం మోదీ కుటుంబం' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, శంకర్, రాజుగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

●మెదక్ అర్బన్: భారత్ దేశమంతా ప్రధాని మోదీ కుటుంబమేనని.. మేరాభారత్.. మేరా పరివార్ ఆయన నినాదమని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రధానికి మద్దతుగా మేము మోదీ కుటుంబం అంటూ ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు.

పలు కాలనీల్లో మున్సిపల్ చైర్మన్ పర్యటన

నారాయణఖేడ్, మార్చి 11: ఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్ సోమవారం మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తాగునీటి సరఫరా, పారిశుధ్య పనుల గురించి ఆరాతీశారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలు తదితర సమస్యలు నెలకొన్నాయని ఆయా కాలనీలవారు ఆయనకు వివరించారు. దశలవారీగా అన్ని కాలనీల్లో సీసీరోడ్లు, మురుగు కాలువను నిర్మిస్తానని హామీఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ శంకర్, కమిషనర్ జగ్జీవన్‌ను వివిధపార్టీల నాయకులు చిరంజీవి, ఇసాక్, పండరి, హన్మంతు, సురేష్, పండరియాదవ్ సన్మానించారు.